# ఆర్థిక పునర్నిర్మాణం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఈ పేపర్లోపడ్డ ఆరు కాలాల ఉపన్యాసం చూశావా?'

'చూళ్లేదండి.'

'నిర్భాగ్యుడా—చూడొద్దు టోయ్! ఇదంతా ఏమిటనుకున్నావ్?'

'చిత్తం! ఏమిటనుకున్నానండీ?'

'భద్రపూర్ దివాను ఉపన్యాసమిది—'

'చిత్తం!'

'భద్రపూర్ సంస్థానంలో యుద్ధానంతర ఆర్థిక పునర్నిర్మాణాన్ని గురించి ఆర్థిక మహాసభలో ఆయన చెప్పిన ఉపన్యాస సారాంశమిది—'

'చాలా గొప్ప విషయమండి!'

'మరి, నా శేషయ్యా! నువ్వుకూడా కుచ్చుపాగా వేసుకుని తయారుగా వుండాలి—'

'దేనికండీ?'

'భయపడకు! యుద్ధానంతరం మనం అమలుజరపబోయే ఆర్థిక పునర్నిర్మాణం...'

'వొద్దండి! అంతంత పెద్దపెద్దమాటలు మనకొద్దు—'

'శేషయ్యా! మారాం చెయ్యకు—'

'మనకా ఉపన్యాసాలూ, పెద్దకబుర్లూ ఒద్దండి—'

'భిడియపడకోయి—ఇన్నాళ్ళకి వొచ్చిందే ఒక అవకాశం నీ వాగ్ధాటీ చూపడానికి—'

'ఏమని ఉపన్యసించమంటారూ? ఎవరిఎదుట?'

'ముందే చెప్పానుగా యుద్ధానంతరం ఆర్థిక—'

'మన ప్రజలు అటువంటి మాటలు విని భయపడతారండి—'

'శేషయ్యా! నువ్వెప్పుడూ ఇలానే ఉత్సాహభంగం చేస్తున్నావు-'

'ఏం చెయ్యమంటారు-మన పరిస్థితులు ఇటువంటివి—'

'నీ పరిస్థితులు మండిపోయిరి! ఆ భద్రపురందివాను చూడూ ప్రతి దానికీ ఓ గంభీరమైన ఉపన్యాసం చేసి పారేస్తాడు—ఎంతగా వెనక బడివున్నామోయి మనం! నీ జన్మలో నువ్వు మన సంస్థానపు విషయా లను గురించి ఒక్కటంటే ఒక్కమాటైనా నోరువిప్పి మాట్లాడేవా?'

'ఉపన్యాసాలు చేయవలసిన పరిస్థితులేమీ ఏర్పడలేదండి ఇక్కడ-అన్నిపనులూ సజావుగా జరిగిపోతూండే మన సంస్థానంలో—'

'శేషయ్యా! ఇక మాటాడకు-పోయి ఉపన్యాసం తయారుచెయ్యి-'

'ఇప్పుడేనాండీ?'

'ఇప్పుడేనండి శేషయామాత్యుడుగారూ!'

'ప్రభువుల కంత కోపం తగదు-'

'మరేమిటిచేసేదీ? సాటి సంస్థానాల వారంతా అన్నేసి ఉపన్యా సాలు దంచేస్తూంటే మనం-?'

'వారికి పని పాటలు లేవండి—మనం మాట్లాడకుండా పనిచేసి చూపిస్తాం-'

'శేషయ్యా! ఈ వట్టి గడ్డిమాటలు నాముందర కాదు—చూస్తాను నీప్రజ్ఞ-రేపు సాయంత్రం నువ్వు మన చెరువు గట్టుమీద రెండుగంటల సేపు గంభీరంగా ఉపన్యసించాలి-'

'తప్పదండీ?'

'తప్పదు. ఎన్నాళ్లనుంచో ముచ్చటపడుతున్నాను, ఫలానా సంస్థానపు దివాన్జీ ఇన్నిఘుంటలసేపు ఉపన్యసించారని పేపర్లో పడితే చూదామని—'

'తమరే మాటాడకూడదూ?'

'ఉహు! దివాన్లు మాట్లాడితేనే ఈ పేపర్లవాళ్లు వేసుకుంటారు-రాజుల మాటలమీద వారికి నమ్మికలేదు-'

'వింతగా మాట్లాడుతున్నారు-'

'వింతేమీ లేదు-అయినా సంస్థానపు కార్యభారాలన్నీ మోసేవాడివి నువ్వు. అంచేత నువ్వు మాట్లాడితేనే ప్రజలకూ పత్రికలవారికీ నీమీద నమ్మక గౌరవాలుంటాయి-పోయి ఉపన్యాసం సిద్ధం చేసుకో-'

'దేన్నిగురించి మాటాడమంటారూ?'

'మళ్ళీ మొదటికొచ్చావా? ఇష్టంలేని కుక్కని వేటకెళ్ళమంటే - ------ మన సంస్థానంలో యుద్ధానంతరం జరగబోయే ఆర్థిక పునర్నిర్మాణాన్నిగురించి-తెలిసిందా? భద్రపురం దివానుగారి ఉపన్యాసం కన్నా దీర్ఘంగా ఉండాలి నీ ఉపన్యాసం—'

'సరేనండి! అయితే ముందుగా మనం పునర్నిర్మాణం చేయబోయే విషయాన్ని గురించి మనం తెలుసుకోవాలండి-'

'నీ మొఖంలావుంది-ఇప్పుడే కాదోయి చెప్పాను మన సంస్థానపు ఆర్థిక విషయాన్ని గురించనీ? దాన్నిగురించి మనకు తెలియని దేముందీ?'

'అంతా తెలియనిదే నండి—'

'శేషయ్యా! చూడూ నువ్వు ఉపన్యాసం ఇస్తావా, పిచ్చాసుపత్రిలో జేర్తావా-రెండే అవకాశాలు—'

'ప్రభువులు కొంచం ఓరిమిపట్టి వినాలి-ఎవరైనా ఆర్థిక పునర్నిర్మాణానికి పూనుకొనేది ఆర్థికపరిస్థితి బాగులేనప్పుడు—మరమ్మత్ కోరేటప్పుడు-'

'శేషయ్యా! ఉపన్యాసం తయారు చేసుకోమంటే నిక్షేపంలా వెళ్ళక నీకీ కుశ్శంక లెందుకోయ్?'

'మనం ఉపన్యసించే దాంట్లో తగినంత ఔచిత్యం కనిపించాలండి-మన సంస్థానంలో ఆర్థిక పరిస్థితి చక్కగా వుంటూండేటప్పుడు ఈ మరమ్మత్ కార్యక్రమం......'

'శేషయ్యా! నీమొహం యీడ్చా-ఆ భద్రపూర్ దివానును చూగు - వాడిని చూసైనా నేర్చుకో—'

'వాళ్ళ సంస్థానమంతా అప్పులలో చిక్కుకుందండి—'

'అంచేత ఆయన ఇంత ఉపన్యాసం ఇచ్చాడంటావా?'

'అంతేనండి! ఆ అప్పులు తీర్చడంకోసం ముందు పన్నులూ అవీ పెంచేసి ప్రజలవద్ద అనేక విధాల డబ్బు గుంజుకుని ఆ తర్వాత మళ్ళీ వారిపరిస్థితి మరమ్మత్ చేస్తానంటాడు ఆయన—'

'శేషయ్యా! నువ్వు మాట్లాడేది విషం! భద్రపురం దివాన్ విన్నాడంటే నిన్ను గుండేసి కాల్పిస్తాడు—'

'మీకే తెలుసునండి-మనకీ భద్రపురం వారికీ భేదం-మన సంస్థానం కావలసిన వాళ్ళకి ఇంత ఇచ్చిందిగాని ఎప్పుడూ ఎవరికీ ఏవిధంగానూ ఋణపడివుండలేదు-మనం పన్నులూ అవీ పెంచేసి ప్రజల ఉసురు పోసుకోలేదు. మన ఆర్థికస్థితి ఒహటోరకంగా వుంది-మనం ఏ ఉపన్యాసాలూ ఇవ్వనఖ్ఖర్లేదు—'

'శేషయ్యా! నువ్వు నాతో-నా పరిపాలనతో సహాయ నిరాకరణకు దిగేవు-నీమాటలు నమ్మి నేను మోసపోయేవాడిని కాను-నా హయాంలో ఇంతవరకూ సంస్థానపు సంగతులను గురించి నువ్వు ఒక్క ఉపన్యాసం కూడా చేయలేదు-నా సంస్థానాన్ని గురించి ఇంతవరకు ఒక్క విషయం కూడా ప్రపంచంగాని, పత్రికలుగాని గుర్తించలేదు. ఈ పరిస్థితికి కారణం నువ్వే—నీ పిల్లి తలకాయే—ఇంక నేను సహించలేను—శేషయ్యా!—'

'ప్రభూ! దురాగ్రహం వొద్దు-ఏం చెయ్యమంటారో శెలవిస్తే?'

'శెలవిస్తే చేస్తావా?'

'తప్పకుండా.'

'యుద్ధానంతరం మనంకూడా అన్ని దేశాలవారితో బాటూ, అన్ని సంస్థానాలవారితో బాటూ ఆర్థిక పునర్నిర్మాణం చెయ్యబోతున్నామని మనం ముందుకువచ్చి గట్టిగా-ఖణేల్ మని ప్రపంచానికి వినిపించేట్టుగా-చెప్పుకోవాలి-అందుకు నువ్వు గంభీరంగా ఉపన్యసించాలి—'

'ఇది తప్పని సరి అయితే—'

'తప్పని సరే! నువ్వు భోజనంచేయడం ఎంత తప్పని సరో, నిద్రంచడం ఎంత తప్పని సరో, నీ పెళ్ళాన్ని కితకితలు పెట్టడం ఎంత తప్పని సరో ఇదీ అంత... రేపీపాటికి కుచ్చుపాగాతో సహా నువ్వు చెరువుగట్టు మీద హాజరుగా వుండాలి—నేను నీకు పూలదండ వేస్తాను—'

'మహాప్రసాదం! ప్రభువుల ఆజ్ఞ అంతే అయితే—'

'ఇఖ మాట్లాడకు—అంతే!'

'అయితే వెంటనే ఒక డజనుమంది గూండాలకు కబురు చేయిస్తాను...'

'ఎందుకూ?'

'భద్రపురం సంస్థానంలోని పరిస్థితులను ఇరవై నాలుగు గంటల లోగా—అంటే, రేపు నా ఉపన్యాసం ప్రారంభమయ్యేలోగా—మన సంస్థానంలోకూడా ప్రవేశపెట్టడానికి......'

## శిలాశాసనం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'ఈ పేపర్లోపడ్డ ఫొటో చూడూ—ఎవరీ సుందరి?'

'ప్రసిద్ధ సినీమాతారండి—ఆమెది బొంబాయి—'

'మన సంస్థానంలోకూడా ఇలాంటి వాళ్ళెవళ్ళేనా వున్నారా?'

'ఇంకా అందమైన వాళ్ళే వున్నారండి—'

'ఈవిడకి మల్లే ఫిలిములలో నటిస్తారా వాళ్లు?'

'నటించరండి - ఫిలిములలో నటించడమంటే ఏమిటో వారికి తెలీదు—కాని, ఈవిడకన్నా అందమైనవాళ్లు మాత్రం వున్నారండి—'

'ఏం ప్రయోజనం? ఫిలిములలో నటించనితర్వాత ఎంత అందముంటేనేం? కొరుక్కు తింటామా ఆ అందాన్ని?'

'చిత్తం! నిజమేనండి—'